క్లుప్తంగా

నేడు అవగాహన సదస్సు

రేగొండ: మండల కేంద్రంలో ట్రాక్టర్ డ్రైవర్లకు ప్రమాద నివారణల కోసం నేడు (గురువారం) అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు రేగొండ ఎస్సై రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎస్పీ సంపత్‌రావు పాల్గొంటారని తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సై కోరారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

పలిమెల: మండలం కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. సమావేశానికి అధికారులు హాజరనప్పటికీ కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు వెల్లడించారు. మళ్లీ సమావేశం ఎప్పుడు నిర్వహిస్తామనేది త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

వెంకటాపురం(కె) మండల కేంద్రంలోని వేప చెట్టు సెంటర్‌లో రెండు ఇళ్లలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వేప చెట్టు సెంటర్‌లోని కిరాణ వ్యాపారి ఇంట్లో కిరాయికి ఉంటున్న అంగన్ వాడీ ఉద్యోగి రూమ్‌లో రూ.30 వేల నగదు, పక్కనే ఉన్న మరో ఇంట్లో సైతం గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగల కొట్టి చోరీకి పాల్పడి నగదు, వెండి వస్తువులు దొంగిలించనట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ బండారి కుమార్ పోలీసులతో సంఘటన ప్రాంతానికి వచ్చి విరరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన కమిటీ ఎన్నిక


తుల శ్రీనివాస్, అధ్యక్షుడు


సామల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మార్కేండేయ పద్మశాలి పరపతి సంఘం నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా తుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కుసుమ రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా సామల శ్రీనివాస్, కోశాధికారిగా కందకట్ల రాజులను ఎకగ్రీంగా ఎన్నుకున్నారు.

వ్యక్తి అదృశ్యం



ములుగు రూరల్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలోని జీవింతరావుపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవింతరావుపల్లి గ్రామానికి చెందిన బానోత్ తుకారాం గ్రామంలో కిరాణం వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం 6.30 నిమిషాలకు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో అతడి భార్య కవిత చుట్టూ పక్కల, బంధువుల ఇళ్లలో వెతికి అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆచూకి తెలిస్తే నంబర్‌కు 8712670081కు సమాచారం అందించాలని అన్నారు.

రోడ్డు నిర్మాణమయ్యేనా?

- అటవీ శాఖ అధికారుల అభ్యంతరంతో ప్రారంభం కాని పనులు
- ఇబ్బంది పడుతున్న బొమ్మనపల్లి గ్రామస్తులు


బొమ్మనపల్లి-ప్రగళ్లపల్లి రహదారి

వాజేడు: మండలంలో మారుమూలన ఉన్న బొమ్మనపల్లి ఒక గిరిజన గ్రామం. ఇక్కడ 80 కుటుంబాల వరకు జీవనం సాగిస్తోన్నాయి. చుట్టూ అడవి ఒక వైపు గుండ్లవాగు. ఇక్కడి నుంచి మండల కేంద్రానికి రావాలంటే పూసూరు మీదుగా 15 కిలో మీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి ఉంటుంది. అదే విధంగా వెంకటాపురం(కె) మండలానికి వెళ్లాలన్నా ఏడ్జర్లపల్లి మీదుగా 20 కిలో మీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. దీంతో గ్రామస్తులు రాకపోకలపై ఏడాది మొత్తం ఇబ్బందులు పడుతూనే ఉంటారు. వీరికి దగ్గర మార్గం బొమ్మనపల్లి నుంచి ప్రగళ్లపల్లి వరకు అడవి దారి గుండా ప్రయాణిస్తే ప్రధాన రహదారి వస్తుంది. ఈ రహదారి కావాలని ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు పోరాటం చేస్తూనే ఉన్నారు. బొమ్మనపల్లి గ్రామం నుంచి నేరుగా అటవీ మార్గం ద్వారా ప్రగళ్లపల్లి వద్ద వాజేడు, భద్రాచలం రహదారికి చిన్న కాలి బాట ఉంది. ఈ దారిపై పూర్వీకుల నుంచి ఉపయోగిస్తూనే ఉన్నారు. బొమ్మనపల్లి ప్రజలు వాజేడు, వెంకటాపురం(కె) గ్రామాలకు రావాలంటే అదొక్కటే దగ్గరి మార్గం కావడంతో రహదారి వేయమని 15 సంవత్సరాలుగా గ్రామస్తులు ప్రజాప్రతినిధులను, అధికారులను కోరుతున్నారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు 5 కిలో మీటర్ల రహదారికి ఎల్‌డబ్ల్యూయి నిధులను రూ.25 లక్షలను మంజూరు చేశారు. రహదారి నిర్మాణానికి సిద్ధం అవుతుండగా అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. రిజర్వ్ ఫారెస్టులో రహదారి వేయడానికి కుదరదని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో రహదారి పనులకు బ్రేక్ పడింది. భద్రాచలం మాజీ ఎమ్మెల్యేలు కుంజ సత్యవతి, సున్నం రాజయ్యల ద్వారా అటవీ శాఖపై ఒత్తిడి తీసుకు వచ్చినా లాభం లేకుండా పోయింది. దీంతో రహదారి రూపు దాల్చుకోలేదు. గ్రామస్తులు అడవి మార్గంలో ఇసుకలో నడసి వస్తున్నారు. సైకిళ్లు కూడా వెళ్లే అవకాశం లేక పోవడంతో ఎడ్ల బండ్లను ఆశ్రయిస్తున్నారు. తమకు రహదారి ఏర్పాటుకు అధికారులు ముందుకు వచ్చినా అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడంతో కార్యరూపం దాల్చడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు కల్పించుకొని తమ గ్రామానికి రహదారిని వేయించేలా అటవీ శాఖ నుంచి అనుమతులు ఇప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త


జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ చిన్న

ఏటూరునాగారం: మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డాక్టర్ జె చిన్న అన్నారు. మహాత్మామ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెమినార్ హాల్‌లో రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డాక్టర్ జె చిన్న మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలోని కులపరమైన వివక్షను, అన్యాయాలను రూపుమాపడానికి జీవితాన్ని ధారపోసిన మహాత్ముడని కొనియాడారు. భారతదేశంలో ఉన్న కుల వ్యవస్థను నిర్మూలించడానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. భారతదేశంలో మహిళలు చదువుకోవడానికి 1848వ సంవత్సరంలో మొదటిసారిగా మహిళ పాఠశాలను ప్రారంభించారని సమాజం బాగుపడాలంటే, మహిళలు రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా పురుషులతో పాటు సమాన హక్కును, సమాన చదువును అందిపుచ్చుకోవాలని తెలిపిన వ్యక్తి అన్నారు. ఆదివాసుల హక్కుల కోసం ఎంతో పోరాటం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవీందర్, రాజనీతి శాస్త్రం విభాగం అధిపతి రమేష్, డాక్టర్ ఎం విజయలక్ష్మి, డాక్టర్ ఘన్‌సింగ్, రమేష్ కుమార్, నవీన్, జ్యోతి, సురేష్, మున్ని పాల్గొన్నారు.

పలువురి బైండోవర్


బైండోవర్ చేస్తున్న సిబ్బంది

గోవిందరావుపేట: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వ్యక్తులను తహసీల్దార్ సృజన్ కుమార్ ఎదుట పస్రా ఎస్సై కమలాకర్ బైండోవర్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా, భవిష్యత్‌లో ఎటువంటి తప్పులు చేయకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు. బైండోవర్ చేసిన వారిలో మద్దుల వెంకటసత్యనారాయణ, గట్ల నాగేశ్వరరావు, భూక్య చక్రమ్మ, భూక్య తారాచందు, భూక్య వెంకటరమణ, అజ్మీర వాల్య, అజ్మీర రవీందర్, అత్కూర్ సేవ ఉన్నారు.

బీఎస్పీ గెలుపునకు కృషి


మాట్లాడుతున్న రాజశేఖర్

ములుగు రూరల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎంపీగా బీఎస్పీ అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజశేఖర్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బహుజనలు రాజ్యాధికారం సాధించాలంటే రాజకీయాలలో బహుజనులు అధిక సంఖ్యలో విజయం సాధించాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, మహేష్, సురేష్, రఘువీర్, దేవేందర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సన్మానం


శాలువాతో సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రేగొండ: మండలంలోని పెద్దంపల్లి గ్రామానికి చెందిన డెఫ్ క్రికెట్ క్రీడాకారుడు పసుల రాజును జిల్లా కాంగ్రెస్ నాయకుడు అప్పం కిషన్ బుధవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నూనె నర్సయ్య, సంజీవరెడ్డి, సన్నీ, చందు, రంజిత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఏటూరునాగారం: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గిరిజన సంక్షేమ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగాల శ్రీరాములు, గొడం చందన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని, గిరిజన సంక్షేమశాఖలో మండల విద్యాధికారి, డిప్యూటీ డీఈఓ, డీఈఓ పోస్టులను వెంటనే మంజూరు చేయాలన్నారు. గిరిజన సంక్షేమశాఖ కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లను రెగ్యులర్ చేయాలని, పాఠశాల విద్యాశాఖ ద్వారా ఆశ్రమ పాఠశాలలకు స్కూల్ గ్రాంట్స్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలని, భార్య భర్తలకు ఒకే దగ్గర పోస్టు ఇవ్వాలన్నారు. అనంతరం యూనియన్ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డిని, అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డిని కలిసి వినతి పత్రాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సారయ్య దొర, సుధాకర్, ఈరులాల్, సారయ్య, మేర్‌సింగ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న బాల్య మిత్రులు

చిట్యాల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన గోపగాని సురేందర్ (28) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతనితో చదువుకున్న చిన్ననాటి మిత్రులు బాధిత కుటుంబానికి రూ.45వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాల్య మిత్రులు బుర్ర ధనుంజయ, చింతకింది సతీష్ కుమార్, శివ, రాకేష్, భరత్, మధు, విష్ణు, ప్రశాంత్ , కుమార్, కరుణ, అరుణ తదితరులు ఉన్నారు.

ఓవర్‌లోడ్‌తో ఇసుకను తరలిస్తే చర్యలు


లారీలను తనిఖీ చేస్తున్న సీఐ బండారి కుమార్

వెంకటాపురం(కె): లారీల్లో ఇసుకును పరిమితికి మించి ఓవర్‌లోడ్‌తో తరలిస్తే చర్యలు తీసుకుంటామని వెంకటాపురం సీఐ బండారి కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆలుబాక గ్రామ శివారుల్లో ఇసుక లారీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అలుబాక గ్రామ శివారుల్లో ఉన్న వే బ్రిడ్జి వద్ద లారీలను వేట్ చేక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇసుక ర్యాంప్‌ల నుంచి ఇసుకను తరలించే లారీలు అనుమతులు ఉన్న మేరకే ఇసుకను లోడ్ చేసుకోని తీసుకువెళ్లాలని అన్నారు. ఈ తనిఖీల్లో సీఆర్‌పిఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న దెనార్జున్‌రావు

వాజేడు: పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా నిరంతరం కృషి చేస్తా అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లె దెనార్జున్ రావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం కార్యకర్తలతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధిష్టాన నిర్ణయం ప్రకారం పార్టీని ముందుకు తీసుకు వెళ్తామన్నారు. అధిష్టానం నుంచి వచ్చే ప్రతీ సమాచారం అందరికి స్వయంగా తెలియజేస్తానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీకి మెజారిటీ వచ్చేలా కలిసి కట్టుగా పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా తొలిసారి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలలో ఒకరికి రావడం హర్షించే విషయమన్నారు. ఈ సమావేశంలో రాంబాబు, రామ దాసు తదితరులు ఉన్నారు.

మెరుగైన వసతులు కల్పించాలి


మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న సునీత

పలిమెల: పాఠశాలలో నీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం, కరెంట్, ఫ్యాన్లు, లైట్లు, తదితర మౌలిక వసతులు కల్పించాలని మండల స్పెషల్ ఆఫీసర్ విజయ్‌భాస్కర్ అధికారులను అదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో కల్పించాల్సిన మౌలిక వసతులపై వారితో చర్చించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ ప్రకాశ్‌రెడ్డి, ఏపీఎం సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీఓ వీరాస్వామి ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ప్రత్యేక ప్రత్యేక అధికారి సునీత హాజరై మాట్లాడుతూ.. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం బృహత్తర కార్యక్రమం చేపట్టిందన్నారు. కమిటీ సభ్యులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఏపీఎం అంబాల రవి వర్మ, ఎడ్యుకేషన్ ఏఈ మహేందర్, మండల కో ఆర్డినేటర్ లింగాల కుమారస్వామి, మొగుళ్లపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయపాల్‌రెడ్డి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, మండల సమాఖ్య కార్యదర్శి శోభ, కోశాధికారి శిరీష, సీసీలు శ్రీనివాస్, బాబురావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం


భూపాలపల్లి రూరల్: అవార్డు అందిస్తున్న సభ్యులు


మల్హర్: అవార్డు తీసుకుంటున్న అలకనంద రాథోడ్

భూపాలపల్లి రూరల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలో వివేకనంద సేవాసమితి ఆధ్వర్యంలో కవి, గాయకులను సన్మానించి అవార్డులు మంగళవారం అందించారు. ఈ మేరకు కుందూరుపల్లి గ్రామానికి చెందిన కవి, రచయిత, గాయకుడైనా రమేష్‌ను సన్మానించి అవార్డు అందించారు. అవార్డు అందించిన నిర్వాహకులు సంజీవ రావు, ఎస్ఎస్ ఆర్ విద్యాసంస్థల అధినేత సంపత్‌రావు, కాంగ్రెస్ నాయకులు అప్పం కిషన్, చలనచిత్ర పరిశ్రమ డైరెక్టర్ దామోదర్‌గౌడ్‌లకు అవార్డు గ్రహీత రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

మల్హర్: మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన బేబి బానోతు అలకనంద రాథోడ్‌కు ఉత్తమ రాష్ట్ర స్థాయి నాట్య కళా ప్రవీణ ఉగాది పురష్కార అవార్డు, రుదారం గ్రామ పంచాయతీ పరిధిలోని పాత రుద్రారంగ్రామానికి చెందిన వాయిద్య కారుడు, గాయకుడు కమ్మల ప్రవీణ్ ఉగాది పురష్కరాలు అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ వివేకనందా సేవ సమితి ఆధ్వర్యంలో భూపాలపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు అలకనంద, ప్రవీణ్‌లకు ప్రశాంశ పత్రాలు, శాలువాలతో వారిని సత్కరించారు.

సబ్ రిజిస్ట్రార్‌కు సన్మానం



ఏటూరు నాగారం: ములుగు సబ్ రిజిస్ట్రార్ అధికారిగా ఖమ్మం జిల్లాకు చెందిన సృజన్ పదవి బాధ్యతలు స్వీకరించగా బుధవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ జిల్లా నాయకుడు ముంజల భిక్షపతి గౌడ్ ఘనంగా సన్మానించారు. అనంతరం భిక్షపతి గౌడ్ మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ అధికారి ప్రజలకు స్వచ్ఛందంగా సేవలు అందించాలని నిస్వార్థంగా సేవ చేయాలని అన్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

టేకుమట్ల: మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన పంజాల తిరుపతి అనే గీత కార్మికుడు బుధవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కుతుండగా కాలుజారి కింద పడడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పంజాల తిరుపతి వృత్తిలో భాగంగా రోజు వారిలాగే తాటి చెట్టు ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో కాలుజారి కిందపడడంతో తోటి కార్మికుల సాయంతో ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. నిరుపేద కుటుంబానికి చెందిన తిరుపతిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు తోడేటి ఎల్లాస్వామి కోరారు.

గల్లీకో బెల్ట్‌షాపు!

- మొగుళ్లపల్లిలో విచ్చలవిడిగా దుకాణాలు
- జోరుగా మద్యం విక్రయాలు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



మొగుళ్లపల్లి: మండలంలో ప్రభుత్వం అనుమతి పొందిన వైన్‌షాపులు రెండు ఉండగా.. అనధికారికంగా బెల్ట్ దుకాణాలు మాత్రం మూడు వందల వరకు ఉన్నాయి. గల్లీ గల్లీకి బెల్ట్ షాపు దర్శన మిస్తుంది. సాయంత్రం అయిందంటే జాతరను తలపించేలా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వైన్‌షాపు యజమానులు సిండికేట్‌గా మారారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

300లకు పైగా బెల్ట్‌షాపులు..

మొగుళ్లపల్లి మండలంలో 25 గ్రామపంచాయతీల్లో సుమారు 300లకు పైగా మద్యం బెల్టు షాపులు ఉన్నాయి. మండల కేంద్రంలోని మద్యం దుకాణాల ద్వారా బెల్ట్‌షాపుల నిర్వహణ సాగుతోంది. మద్యం దుకాణదారులు మద్యాన్ని బెల్ట్‌షాపులకు హోల్‌సేల్‌గా వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మద్యం దుకాణాల్లో ఒక్కో బాటిల్‌పై రూ.15నుంచి **రూ.20వరకు** ఆదనంగా **వసూలు** చేస్తున్నారు. **వీటిని** తీసుకెళ్లిన **బెల్ట్** షాపుల వారు గ్రామాల్లో మరో **రూ.10** లాభం **చూసుకొని** విక్రయిస్తున్నారు. **దీంతో** బెల్ట్ షాపుల్లో **కొనుగోలు చేసే** వారికి ఒక్కో **బాటిల్‌కు దాదాపు** రూ.30 **ఆదనంగా చెల్లిస్తున్నారు.** నిజానికి **వైన్స్ నిర్వాహకులు అక్కడ చేసే వ్యాపారం కంటే బెల్ట్** షాపులకు **మద్యాన్ని సరఫరా** చేయడం **ద్వారానే** అధికం **ఆదాయం** పొందు**తున్నారనే** విమర్శలు ఉన్నాయి. **ఇంత** జరుగు**తున్నా** ఎకై ్సజ్ **అధికారులు** మాత్రం **నిమ్మకు నీరెత్తి**నట్టు వ్యవ**హరిస్తున్నారు.** నెలనెలా **మామూళ్లు తీసుకుంటూ** నిర్లక్ష్యంగా **వ్యవహరిస్తున్నారని ప్రజలు** బహిరంగం**గానే విమర్శిస్తున్నారు.**

చోద్యం చూస్తున్న అధికారులు..

అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సిండికేట్ వ్యాపారం గ్రామాల్లో బెల్టుషాపుల రూపంలో మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతుంది. అధికారులు అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుపుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎన్ని రకాలుగా విమర్శలు చేసినా అధికార వర్గాలు మాత్రం అటువైపుగా కన్నెత్తి చూడడం లేదు. ఎన్ని ఆరోపణలు వచ్చినా వాటిపై చర్యలు తీసుకోవడం లేదు.

చర్యలు తీసుకుంటాం..

ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం అమ్మకాలు నిర్వహించాలి. మద్యం షాపుల్లో ఎంఆర్‌పీ కంటే ఎక్కువ రెట్లుతో అమ్మినా, బెల్ట్ షాపులు నిర్వహించినా చర్యలు తీసుకుంటాం.

-రబ్బాని ఎక్సైజ్ ఎస్సై, మొగుళ్లపల్లి

గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ


భూమి పూజలో పాల్గొన్న గ్రామస్తులు

టేకుమట్ల: మండలంలోని మందలోరిపల్లిలో బుధవారం బొడ్రాయి, భూలక్ష్మీ -మహాలక్ష్మీ, మధునమ్మ తల్లి విగ్రహల ప్రతిష్ఠకు కమిటీ సభ్యులతో పాటు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవి, దుబ్యాల ఎంపీటీసీ బిక్కినేని అనితాసంపత్ రావు, మాజీ సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, బిల్లకంటి ఉమేందర్‌రావు ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, వేద మంత్రోచ్చరణల మధ్య భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కానుగుల లక్ష్మన్, చంద్రగిరి రజితాసంపత్, రాజిరెడ్డి, కట్కూరి రాజిరెడ్డి, పులి శ్రీనివాస్‌రెడ్డి, బండి శ్రీనివాస్, రాజమల్లు, రవిందర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

వాజేడు: మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో నేటి(గురువారం) నుంచి ఈ నెల 13 వరకు సీతా సమేత కోదండ రాముడు ఆలయ ప్రారభంతో పాటు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులుతెలిపారు. ఆలయ ప్రారంభం, సీతా, రాముడు, లక్ష్మణుడు, హనుమంతుడి విగ్రహాలను శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు.